సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 27 । మార్చి । 2024



నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు తగిన ప్రతిపాదనలు తయారు చేసి కలెక్టర్‌కు పంపాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సూచించారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సహర్ గురు (ఉ॥)
రాయచోటి :	6.30	4.57
రాజంపేట :	6.31	4.55
పీలేరు :	6.35	4.51
మదనపల్లె :	6.32	5.00

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.130	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 46 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	415	508
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1,245.420 కిలోలు

న్యూస్‌రీల్

కట్టుదిట్టంగా 'పది' పరీక్షలు

వీరబల్లె (రాయచోటి టౌన్): జిల్లాలో పదో తరగతి పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామని డీఈఓ శివప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం న్యాచురల్ సైన్స్ పరీక్షల సరళిని పర్యవేక్షించేందుకు వీరబల్లె సెంటర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని ప్రతి గదిని కలియతిరిగి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 129 సెంటర్ల ద్వారా 23140 రెగ్యులర్ విద్యార్థులు,1023 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉందన్నారు. అయితే 22451 మంది రెగ్యులర్ స్టూడెంట్స్, 493 మంది ప్రైవేట్ స్టూడెంట్స్ హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షలను129 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 84 మంది సిట్టింగ్, 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు,, 1435 మంది ఇన్విజిలేటర్లు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

ఆర్టీసీ సమ్మర్ స్పెషల్ బస్సులు



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణాధికారి రాము

మదనపల్లె సిటీ: వేసవిలో సమ్మర్ స్పెషల్ బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి రాము అన్నారు. మంగళవారం ఆయన మదనపల్లె-1, 2 డిపోలను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన గేట్ మీటింగ్ సమావేశంలో మాట్లాడారు. వేసవిని పురస్కరించుకుని డ్రైవర్లు, కండక్టర్లకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కండక్టర్లు, డ్రైవర్లకు ఓఆర్ఎస్, నీళ్ల సరఫరా చేయాలని ఆదేశించారు. డ్రైవర్లు బస్సులో నీళ్ల బాటిల్ పెట్టుకొనుటకు డ్రైవర్ సీట్ పక్కన అల్యూమినియం షీట్‌తో బాటిల్ హోల్డర్ తయారు చేయమని గ్యారేజీ సిబ్బందిని ఆదేశించారు. త్వరలో కొత్త బస్సులు వస్తాయన్నారు. ఆదాయం పెంచడానికి అందరూ కలసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం మూరే వెంకటరమణారెడ్డి, సీఐలు రేవతి, గీత, ఎంఎఫ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమంతా సిద్ధం.. సర్వం సన్నద్ధం

నేటి నుంచి జైత్ర యాత్ర



సార్వత్రిక ఎన్నికల సమరానికి వైఎస్సార్‌సీపీ సర్వ సన్నద్ధంగా ఉంది. చేసిన మేలును ప్రజలకు వివరించి మరోసారి ప్రజా తీర్పు కోరేందుకు జనం మధ్యకు రానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించి ఎన్నికల ప్రచార పర్వంలో భాగంగా బస్సు యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు.

- నేడు ఇడుపులపాయ నుంచి ఎన్నికల ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టనున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- దివంగత సీఎం వైఎస్ఆర్ ఘాట్‌లో ప్రార్థనల అనంతరం బస్సు యాత్ర ప్రారంభం
- ప్రొద్దుటూరులో తొలి బహిరంగ సభ
- లక్షలాది మంది జనం హాజరవుతారని అంచనా



'మేమంతా సిద్ధం' బహిరంగ సభ వేదిక



ప్రొద్దుటూరులో జరగనున్న 'మేమంతా సిద్ధం' బహిరంగ సభ ప్రాంగణం

సాక్షి ప్రతినిధి, కడప/ప్రొద్దుటూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' కార్యక్రమానికి సర్వం సన్నద్ధమయ్యారు. ముఖ్యమంత్రి బుధవారం విజయవాడ నుంచి కడప విమానాశ్రయం చేరుకుంటారు. ఇక్కడి నుంచి బయలుదేరి ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు చేరుకోనున్నారు. అక్కడ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. అనంతరం మేమంతా సిద్ధం బస్సు యాత్రకు శ్రీకారం చుట్టి రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో సీఎం పర్యటన కొనసాగించనున్నారు. వైఎస్సార్ జిల్లా ముద్దుబిడ్డ, ప్రియతమ నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కడప పార్లమెంటు పరిధిలోని ప్రొద్దుటూరులో ఎన్నికల తొలి సభను నిర్వహించనున్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజానీకం సంసిద్ధులయ్యారు.

కొనసాగుతున్న ఇడుపులపాయ సెంటిమెంట్

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ కార్యక్రమం చేపట్టినా ముందుగా ఇడుపులపాయలోని తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి చెంతన ఘాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఆ తర్వాత కార్యక్రమాన్ని కొనసాగించడం ఆనవాయితీగా వస్తోంది. అదే సెంటిమెంట్‌ను 2024 ఎన్నికల్లో కూడా ఆయన కొనసాగిస్తున్నారు. ఆమేరకు 2019లాగా ఇడుపులపాయ నుంచే అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. అప్పట్లో ప్రచారాన్ని సైతం ఇడుపులపాయ నుంచే మొదలుపెట్టారు. ఆ ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలు, 22 ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. దేశం యావత్తు ఆంధ్రప్రదేశ్ వైపు తిరిగి చూసేలా తీర్పునిచ్చారు. తిరిగి అదే ఆనవాయితీగా ఎన్నికల ప్రచారం చేపట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారు. వైఎస్సార్ ఘాట్‌లో ప్రార్థనల అనంతరం మధ్యాహ్నం ఇడుపులపాయ నుంచి వీరన్నగట్టుపల్లె, వేంపల్లె, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర ప్రొద్దుటూరుకు చేరుకోనుంది. ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని వాసవి సర్కిల్ నుంచి జమ్మలమడుగు బైపాస్ రోడ్డు ద్వారా చౌటపల్లె సర్కిల్ మీదుగా రింగ్ రోడ్డులోని బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకోనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి బహిరంగ సభ ప్రారంభం కానుంది.

లక్షలాదిగా తరలిరానున్న ప్రజానీకం

ప్రియతమ నాయకుడు, జిల్లా వాసుల ముద్దుబిడ్డ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్న తొలి ఎన్నికల ప్రచార సభలో లక్షలాది మంది పాల్గొనేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. నాయకుడికి అండగా నిల్చేందుకు, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా సన్నాహక ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రొద్దుటూరు చుట్టు ప్రక్కల ప్రాంతాలతో బాటు మైదుకూరు, కమలాపురం, జమ్మలమడుగు, బద్వేలు ప్రాంతాల నుంచి అశేష ప్రజానీకం స్వచ్ఛందంగా తరలిరానున్నారు. ప్రొద్దుటూరులో ప్రారంభమయ్యే బస్సు యాత్ర సభ రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు స్థానాలకు ఆదర్శంగా నిలిచేలా జనం ముందడుగు వేస్తున్నారు.

బస్సు యాత్రపై రిహార్సల్



ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

ఎర్రగుంట్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం చేపట్టనున్న బస్సు యాత్ర ఇడుపులపాయ నుంచి వేంపల్లి, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా ప్రొద్దుటూరు వరకూ సాగనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల పట్టణంలోని వేంపల్లి రోడ్డు నుంచి వచ్చే బస్సు యాత్ర రిహార్సల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలో జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్, ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య, కొండాపురం సీఐ వేణుగోపాల్ ఇతర ఎస్ఐలకు ఎస్పీ పలు సూచనలు చేశారు.

కోట్ల నిధులు.. ఏమయ్యాయి బాబూ!

- చంద్రబాబును ప్రశ్నిస్తున్న ముస్లింలు
- 2018 మదనపల్లె ఇఫ్తార్ విందులో చంద్రబాబు ఎన్నో వరాలు
- జీఓలతోనే సరిపెట్టారని ధ్వజం
- నేడు మదనపల్లెకు చంద్రబాబు

మదనపల్లె: ప్రజలకు ఇచ్చిన హామీలు ..అధికారంలోకి వచ్చాక అమలు చేసి విశ్వసనీయత కలిగిన నాయకుడిగా సీఎం వైఎస్ జగన్ ఖ్యాతి కెక్కారు. అదే అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చక, కేవలం జీఓలు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకున్న ఘన చరిత్ర చంద్రబాబుది. ముస్లిం మైనారిటీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ప్రతి సమావేశంలో నెత్తిన టోపీ పెట్టుకుని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు అమల్లోకొచ్చేసరికి టోపీ పెడతారు. 2018 జూన్ 6న.. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి హోదాలో మదనపల్లెలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. జామియా మసీదులో నమాజ్‌ను ఆచరించిన చంద్రబాబు.... మత పెద్దల సమక్షంలో పలు వరాలు ప్రకటించారు. తాను ఇఫ్తార్ విందు స్వీకరించిన జామియా మసీదులో.. ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా మూడో అంతస్తు నిర్మాణానికి రూ.1కోటి రూపాయలను ఇస్తున్నట్లుగా ప్రకటించారు. వక్ఫ్‌బోర్డుకు సంబంధించి హజరత్ టిప్పు సుల్తాన్ స్థలం పరిరక్షణకు, ప్రహరీ నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎస్టేట్‌లోని మదీనా మసీదుకు రూ.20 లక్షలు సహాయాన్ని ప్రకటించారు. ఇందిరానగర్‌లోని షాదీమహల్ నిర్మాణానికి 6.6.2018న రూ.56లక్షలు మంజూరుచేస్తున్నట్లు జీఓ విడుదల చేశారు. దీంతో పట్టణంలోని ముస్లింలు తమపై చంద్రబాబు చూపుతున్న ప్రేమాభిమానాలకు మురిసిపోయారు.అయితే... తొమ్మిదినెలలు గడచినా,ఆయన ప్రేమ... కాగితపు జీఓల్లో తప్ప ఆచరణలోకి రాకపోయేసరికి ఎప్పటిలాగానే మోసపోయామని అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు బుధవారం మదనపల్లెకు రానున్న నేపథ్యంలో ...గతాన్ని తలుచుకుని ముస్లింలు మండిపడుతున్నారు. మోసం చేయడంలో బాబును మించిన ఘనాపాటి లేరని ధ్వజమెత్తారు.

క్లుప్తంగా

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యకు ప్రయత్నించి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ములకలచెరువు మండలం బురకాయలకోటకు చెందిన రెడ్డప్ప భార్య పుష్పలత (26), కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవపడి, మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మదనపల్లె పట్టణం కురవంకకు చెందిన తిరుపాలమ్మ (38) స్థానికంగా ఉన్న కొందరికి ఏడు లక్షలు అప్పుగా ఇచ్చింది. వారు తిరిగి రుణం చెల్లించకపోవడంతో మనస్తాపం చెంది మంగళవారం ఇంటి వద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనలో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులని 108 అంబులెన్స్ వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పదో తరగతి పరీక్ష రాసి వస్తుండగా..

– బస్సు ఢీకొని ముగ్గురు విద్యార్థులకు గాయాలు



గాయపడిన విద్యార్థులు

రైల్వేకోడూరు అర్బన్ : పదో తరగతి పరీక్ష రాసి వస్తున్న ముగ్గురు విద్యార్థులను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీగారిపల్లెకు చెందిన సాహిల్, జస్వంత్ అనే విద్యార్థులు రైల్వేకోడూరు పట్టణంలో 10వ తరగతి పరీక్ష రాసి మరొక 9వ తరగతి విద్యార్థి మనోజ్‌తో కలసి స్వగ్రామం లక్ష్మీగారిపల్లెకు స్కూటీపై బయలుదేరారు. శెట్టిగుంట పంచాయతీ మారావారిపల్లె ప్రధాన రహదారి వద్దకు రాగానే.. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. వారిని తిరుపతిలోని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

బొలెరో బోల్తా.. ఇద్దరు మృతి

సింహాద్రిపురం : సింహాద్రిపురం సమీపంలో మంగళవారం తెల్లవారుజామున మలుపు వద్ద బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరానికి చెందిన వడ్డె కులస్తులు తమ మొక్కు తీర్చుకునేందుకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో ఉన్న అహోబిలానికి శనివారం బొలెరో వాహనంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో వెళ్లారు. మొక్కు తీర్చుకుని తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంమధ్యలోని వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరులో సోమవారం అంకాలమ్మ గుడిలో రాత్రి బస చేశారు. మంగళవారం తెల్లవారుజామున ధర్మవరానికి బయలుదేరారు. సింహాద్రిపురం – వెలిదండ్ల రహదారిలో ప్రమాదకర మలుపు వద్ద బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలోని దేరంగుల ప్రసాద్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి నాయనమ్మ అయిన వెంకటమ్మ, పెద్దనాన్న రమణ, గంగాధర తీవ్రంగా గాయపడ్డారు. వారిని కడప రిమ్స్‌కు తరలిస్తుండగా.. వెంకటమ్మ(57) దారి మధ్యలోనే మృతి చెందింది. మృతుడు ప్రసాద్ భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

సంక్షేమ రథం.. ప్రగతి పథం

- జిల్లా సమగ్రాభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు
- రూ.500 కోట్లతో పులివెందులలో మెడికల్ కళాశాల
- రూ.272 కోట్లతో రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు
- రూ.4440 కోట్లతో పారిశ్రామిక ప్రగతి
- సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు రూ.15,247 కోట్లు జమ



పులివెందులలోని వైఎస్‌ఆర్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

సాక్షి ప్రతినిధి, కడప : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జిల్లా సమగ్రాభివృద్ధి సాధించింది. విద్య, వైద్యం, పారిశ్రామిక ప్రగతి, మౌలిక వసతుల కల్పన ప్రధాన లక్ష్యంగా కొనసాగింది. వైఎస్సార్ జిల్లా ముద్దుబిడ్డ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడంతో నిధులు వరదలా ఉప్పొంగాయి. అత్యున్నత విద్య, వైద్య సంస్థలు వచ్చి చేరాయి. నిర్దేశిత లక్ష్యం కంటే ముందే పరిశ్రమలు ఉత్పత్తి ప్రగతి సాధించాయి. పట్టణాలు సుందరీకరణ సంతరించుకున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే గ్రామీణుల ఇంటి ముంగిట్లోకి పాలన వచ్చి చేరింది. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా రూ.15,247 కోట్లు నేరుగా అర్హులైన లబ్ధిదారుల ఖాతాలకు చేరింది.

కడప గడప ఇక మెడికల్ హబ్

జిల్లా కేంద్రమైన కడపను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దారు. అత్యాధునిక వైద్య సేవలకు నిలయంగా మార్చారు. రిమ్స్ ప్రాంగణంలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, కేన్సర్ హాస్పిటల్, మానసిక వైద్యశాలను రూ.272.81కోట్లతో మూడు ప్రత్యేక వైద్య విభాగాలను అందుబాటులోకి తెచ్చారు. కార్డియాలజీ, పీడియాట్రిక్, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ లాంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇకపై కడప గడపలో రిమ్స్‌లో అందనున్నాయి. రూ.32 కోట్లతో పుష్పగిరి కంటి ఆస్పత్రి, రూ.30 కోట్లతో డాక్టర్ ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ నిర్మించారు. మరోవైపు పుట్టిన గడ్డ పులివెందుల రుణం తీర్చుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారు. రూ.500 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించారు. ఇప్పటికే రిమ్స్‌లో 750 పడకల ఆస్పత్రితోపాటు, 452 సూపర్ స్పెషాలిటీ పడకలు అందుబాటులో ఉన్నాయి. అదనంగా పులివెందుల వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 627 పడకలు ఏర్పాటు చేశారు.

పారిశ్రామిక ప్రగతి సాధన

వెనుకబడిన ప్రాంతంలో పారిశ్రామిక ప్రగతి సాధిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనే కృత నిశ్చయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు. ఆ మేరకు ఉక్కు పరిశ్రమకు 2023 ఫిబ్రవరి 15న భూమి పూజ చేశారు. జేఎస్‌డబ్ల్యు గ్రూపు నేతృత్వంలో రూ.8800 కోట్ల వ్యయంతో నిర్మించదలచిన ఈ ప్రాజెక్టుకు మౌలిక వసతులు సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.720 కోట్లు వెచ్చిస్తోంది. నాలుగులేన్ల రహదారి, రైల్వే కనెక్టివిటీ, నీటి వసతి కోసం పైపు లైన్ ఏర్పాటు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, విద్యుత్ సరఫరా, కాంపౌండ్ వాల్, భవన సముదాయం నిర్మించనున్నారు. గోపవరం సమీపంలోని నెల్లూరు రహదారిలో రూ.1600 కోట్లతో సెంచురీ ఫ్లైబోర్డ్స్ సంస్థను నెలకొల్పారు. 2021 డిసెంబరు 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసి, సరిగ్గా రెండేళ్లకు 2023 డిసెంబర్ 23న సీఎం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సంస్థ కోసం రూ.65 కోట్లతో మౌలిక వసతులు కల్పించారు. ఇందులో స్థానికులు 2078 మందికి ఉద్యోగాలు దక్కాయి. మెట్టప్రాంత రైతులకు ఈ పరిశ్రమ ఎంతో ప్రయోజనకారి కానుంది.

అందుబాటులోకి ఆదిత్య బిర్లా గార్మెంట్స్

పులివెందుల కేంద్రంగా నూతనంగా నిర్మించిన ఆదిత్య బిర్లా గార్మెంట్స్ యూనిట్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. రూ.175 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ సంస్థ నిర్మాణానికి 2021 డిసెంబర్ 24న శంకుస్థాపన చేశారు. ఉత్పత్తి ఆధారిత ప్రయోజనాల (పీఎల్‌ఐ) పథకంలో భాగంగా ఆదిత్య బిర్లా గ్రూప్ టెక్స్‌టైల్స్, బ్రాండెడ్ గార్మెంట్స్ తయారీ యూనిట్‌ను నెలకొల్పింది. ఏటా 24 లక్షల గార్మెంట్స్ తయారీ సామర్థ్యంతో నెలకొల్పిన ఈ యూనిట్‌లో 2100 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ ఉపాధి కల్పించనున్నారు. తొలిదశగా 500 మందికి ఉద్యోగాలు కల్పించారు. కడప సమీపంలో వైఎస్సార్ ఈఎంసీలో ఆల్‌డిక్సన్ కంపెనీ వచ్చి చేరింది. 1300 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయి. జిల్లా వ్యాప్తంగా కోవిడ్ వైరస్ కాలం రెండేళ్లు మినహాయిస్తే, మూడేళ్లలో నికరంగా రూ.4440 కోట్ల పెట్టుబడులు వచ్చి చేరాయి.

నాడు-నేడుతో మారిన రూపరేఖలు

నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకువచ్చారు. ఫేజ్–1లో 1040 పాఠశాలలు, ఫేజ్–2లో 1005 పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. రూ.161.57 కోట్లతో 425 గ్రామ సచివాలయ భవనాలను పూర్తి చేశారు. రూ.86.91 కోట్లతో 415 రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. రూ.51.33 కోట్లతో 330 విలేజ్ క్లినిక్‌లను నిర్మించారు. జిల్లా వ్యాప్తంగా 199 డిజిటల్ లైబ్రరీలను నిర్మించతలపెట్టగా ఇప్పటికే రూ.10 కోట్లతో 73 డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి వచ్చాయి. సచివాలయం పరిధిలో రూ.20లక్షల చొప్పున గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మించారు. జిల్లా వ్యాప్తంగా రూ.1015 కోట్లతో ఆర్‌అండ్‌బీ పరిధిలో 1528 కిలోమీటర్ల రోడ్డు సౌకర్యం కల్పించారు.

నవరత్నాలతో లబ్ధిదారుల మోముల్లో ఆనందం

కూలికి పోతే కుండ కాలాల.. లేదంటే ఎండ కాలాల అన్న సామెత పాత రోజుల్లో ఉండేది. దీనిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ చెరిపేసింది. నవరత్నాలతో పేదలను ఆదుకుంటానని చెప్పిన మాట ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు నిధులు జమ చేశారు. జిల్లా వ్యాప్తంగా 28 ప్రభుత్వ పథకాల ద్వారా 16,43,257 మంది లబ్ధిదారులకు రూ.15,247.18 కోట్లు నేరుగా సీఎం బటన్ నొక్కి చేరవేశారు. దాంతో సామాన్యుడి కొనుగోలు శక్తి పెరిగింది. సమాజంలో ఆర్థిక లావాదేవీలు పెరిగి, వృద్ధి రేటు అమాంతం పెరిగిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

పిల్లల కిడ్నాప్‌నకు యత్నం

వాల్మీకిపురం : ఓ గుర్తు తెలియని మహిళ పిల్లల కిడ్నాప్‌నకు యత్నించిన సంఘటన సోమవారం రాత్రి వాల్మీకిపురంలో చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ పరిధి నాయక్‌వీధిలోని రైల్వేగేట్ సమీపంలో నివాసముండే ఓ ముస్లిం ఇంటి దగ్గరకు యాచకురాలిగా వచ్చి అన్నం పెట్టాలని అడిగింది. అప్పటికే రాత్రి 10 గంటల సమయం అవుతుంది. ఇంటి దగ్గర ఇద్దరు పిల్లలు ఆడుకుంటున్నారు. గమనించిన మహిళ చాకెట్లు ఇస్తానంటూ నమ్మబలికి ఇద్దరు పిల్లలను దగ్గరకు చేర్చుకొని రైల్వే ట్రాక్ సమీపంలోని చీకటి ప్రాంతానికి తీసుకెళ్లింది. పిల్లలు భయపడి కేకలు వేశారు. రంజాన్ మాసం కావడంతో ముస్లిం యువకులంతా వీధుల్లోనే ఆరుబయట ఉన్నారు. దీంతో అనుమానం వచ్చిన యువకులు సంఘటనా స్థలానికి పరుగులు తీశారు. అక్కడే ఉన్న గుర్తు తెలియని మహిళను ప్రశ్నించగా, తనకేమీ తెలియదని బుకాయించడంతో అప్పటికే అక్కడికి చేరుకున్న మహిళలు కిడ్నాప్‌నకు యత్నించిన మహిళకు దేహశుద్ధి చేశారు. అక్కడి నుంచి ఆ మహిళ ఉడాయించింది. పిల్లలు ఇద్దరు సురక్షితంగా వారి కుటుంబ సభ్యుల చెంతకు చేరుకున్నారు. ఈ విషయంపై స్థానిక ఎస్‌ఐ నాగేశ్వర రావును వివరణ కోరగా.. కిడ్నాప్ విషయమై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు, మహిళలు కనపడితే తక్షణమే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు.

గేటు విషయమై ఘర్షణ

మదనపల్లె : పొరుగింటి వారితో గేటు విషయమై ఘర్షణ పడడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన భూపతి కుమారుడు హరిబాబు (40) స్థానికంగా బట్టలదుకాణం నిర్వహిస్తున్నాడు. అతని పక్కింటి వారు హరిబాబుకు సంబంధించిన గోడకు గేటు ఉంచారు. గేటు వేసిన ప్రతిసారి శబ్దంతో ఇబ్బందిగా ఉందని, తన గోడకు గేటు తీసేయాలని పక్కింటి వారితో పలుమార్లు చెప్పాడు. అయినా వారు పట్టించుకోకపోగా, సోమవారం రాత్రి మరోసారి ఇదే విషయమై గొడవపడ్డారు. గొడవలో పక్కింటివారైన శ్రీనివాసులు, వెంకటరమణ.. హరిబాబుపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడు జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొంది వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు తగిన ప్రతిపాదనలు తయారు చేసి కలెక్టర్‌కు పంపాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సూచించారు. స్థానికంగా మంగళవారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉన్న కారణంగా ఎన్నికల కమిషన్ అనుమతితోనే సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తమ మండలంలో నెలకొన్న నీటి ఎద్దడిపై పలువురు జెడ్పీటీసీలు మాట్లాడారు. గండికోట నుంచి పెన్నానది ద్వారా ఆదినిమ్మాయపల్లె ఆనకట్టకు నీరు ఇస్తున్నారని కో ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా తెలిపారు. అక్కడి నుంచి కేసీ కెనాల్ ద్వారా నీటిని వాటర్ గండి వరకు తీసుకు వెళుతున్నారని పేర్కొన్నారు. అక్కడి నుంచి కడప నగర తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారన్నారు. ఖాజీపేట మండలంలోని ముత్తలూరుపాడు ఎస్టీ కాలనీ, భూ మాయపల్లె, శాంతినగర్ తదితర గ్రామాల్లో ఇప్పటికే నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చిందన్నారు. తమ మండలంలోని గ్రామాల దాహార్తిని తీర్చేందుకు ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచి కేసీ కెనాల్ సిస్టమ్ ద్వారా తాగునీరు విడుదల చేయాలని కోరారు.

బోర్లు వేయకుండా అడ్డుపడుతున్న బీటెక్ రవి

పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ సిద్దవరం, ఎరసాల, గానుగపెంట, రాజాసాహెబ్‌పేట తదితర గ్రామాల్లో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రంగసముద్రం గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులకు తాగునీటి కనెక్షన్ ఇప్పించాలని కోరారు. చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కల్లూరుపల్లె, సుగాలితండా తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. కోడ్ ఉందనే నెపం చూపి బోర్లు వేయకుండా టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఇందుకు అన్నమయ్య జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రసన్నకుమార్ బదులిస్తూ ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపి ఎన్నికల సంఘ అనుమతితో బోర్లు వేస్తామన్నారు. రామాపురం జెడ్పీటీసీ వెంకట రమణ మాట్లాడుతూ సుద్దమళ్ల, ఓబుల్‌రెడ్డిగారిపల్లె, రాచపల్లె, నల్లగుట్టపల్లె, గంగనేరు గ్రామాల్లో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఏకలవ్య నగర్‌లో తాగునీరు సరఫరా చేయాలని కోరారు. బద్వేలు జెడ్పీటీసీ మాట్లాడుతూ బుడ్డాయపల్లె ఎస్టీ కాలనీ, చింతల చెరువుపల్లె, రాజుపాలెం గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తెలిపారు. దోబీఖానాకు నీరు ఇవ్వాలని చెన్నూరు ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ కోరారు. ఇందుకు స్పందించిన జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులతో కూడిన బృందాలు వాటర్ ఆడిట్ ప్లాన్ తయారు చేస్తున్నారని తెలిపారు. ఏదైనా గ్రామంలో ఎలాంటి నీటి వనరు లేనిపక్షంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు తాగునీరు రవాణా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డితోపాటు వివిధ మండలాల జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొలం వివాదంలో ఘర్షణ

ముగ్గురికి గాయాలు



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మదనపల్లె : పొలం వివాదం కారణంగా జరిగిన ఘర్షణలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. మంగళవారం మదనపల్లె మండలంలో జరిగిన ఘటన వివరాలు... అంకిశెట్టిపల్లెకు చెందిన సి.కృష్ణయ్యకు ఖాతా నంబర్ 218లో నాలుగు సర్వే నెంబర్లలో 2.04 ఎకరాల పొలం ఉంది. అయితే.. ఆయన వ్యాపారరీత్యా తిరుపతిలో కుమార్తె కోకిల వద్ద ఉంటున్నాడు. కుమారుడు ప్రతాప్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అయితే ఇదే భూమిపై తమకు హక్కులు ఉన్నాయంటూ, కృష్ణయ్య తమ్ముడైన జగన్నాథం కొంత కాలంగా గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం పొలం వద్ద ప్రతాప్‌ను జగన్నాథం, అతని కుమారుడు నవీన్‌కుమార్‌లు దాడి చేసి కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న కృష్ణయ్య కుమార్తె కోకిల(29), అల్లుడు రాజశేఖర్‌బాబు(50), బంధువు రవిచంద్ర(43)లు కలిసి అంకిశెట్టిపల్లెలోని పొలం వద్దకు వెళ్లారు. ఇదే సమయంలో అక్కడే ఉన్న జగన్నాథం, అతడి భార్య చంద్రకళ, కుమారుడు నవీన్ కుమార్ వీరితో గొడవకు దిగారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతుండగా, తాలూకా ఎస్‌ఐ రవికుమార్ అక్కడికి చేరుకున్నారు. ఎస్‌ఐ ఏకపక్షంగా వ్యవహరిస్తూ, తమను పరుషంగా దూషిస్తూ తీవ్రంగా కొట్టారని బాధితులు కోకిల, రాజశేఖర్‌బాబు, రవిచంద్ర ఆరోపించారు. అక్కడ నుంచి స్టేషన్‌కు తీసుకెళ్లి మరోసారి కొట్టారని, తర్వాత చికిత్సలకై జిల్లా ఆస్పత్రి వద్ద వదిలిపెట్టారని చెప్పారు. గత మూడు నెలలుగా భూవివాదం కారణంగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నామని, తమకు న్యాయం చేయకపోగా, పోలీసులు దౌర్జన్యం చేశారని వాపోయారు. ఈ విషయమై ఎస్‌ఐ రవికుమార్ వివరణ ఇస్తూ.. పొలం వద్ద ఘర్షణ జరుగుతోందని సమాచారం అందడంతో అక్కడకు వెళ్లామని, గొడవను అదుపు చేసే క్రమంలో వారిని వారించామన్నారు. రాజశేఖర్‌బాబు, రవిచంద్రలు మద్యం మత్తులో ఉండటంతో స్టేషన్‌కు తరలించామన్నారు. వైద్య పరీక్షలకై జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లామన్నారు. పోలీసులు బాధితులను కొట్టారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్‌ఐ

పీలేరు రూరల్ : తమ కంపెనీలో డిపాజిట్ చేస్తే రెట్టింపు ఇస్తామని పలువురి నుంచి వసూళ్లు చేసి మోసం చేసిన కేసులో నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నిందితున్ని అరెస్ట్ చేసి, కేసుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరుకు చెందిన ఇనపర్లాళ్ల బాలన్న అలియాస్ బాలరాజు నంద్యాల టౌన్‌లో ఉంటూ విన్ ఇండియా ఆయుర్వేదిక్ కాస్మోటిక్ అండ్ జనరల్ స్టోర్స్, మహిమా ఆయుర్వేదమ్ అను రెండు కంపెనీలకు ఎండీ అని, పై కంపెనీలపై బాలన్న అకౌంట్‌లు ఓపెన్ చేశాడు. ఆయన స్నేహితుడైన ప్రకాశం జిల్లా కనిగిరి మండలానికి చెందిన హైజాక్‌తో కలసి 2023 మార్చి నెలలో పీలేరుకు వచ్చారు. పీలేరు పట్టణంలో నివాసం ఉన్న మల్లికార్జున, మురళీ అనే టీచర్లతో పరిచయం చేసుకున్నారు. వారి కంపెనీలో రూ.1 లక్ష డిపాజిట్ చేస్తే 20 వారాలకు రూ. 1.80 లక్షలు ఇస్తామని చెప్పి డిపాజిట్లు చేయించుకున్నారు. అనంతరం సెప్టెంబర్ నెలలో పీలేరుకు చెందిన టీచర్ ఖాదర్‌వల్లి వద్ద రూ.7.75 లక్షలు డిపాజిట్ చేపించుకున్నారు. అదే విధంగా పీలేరులో సుమారు 50 మంది దగ్గర రూ.8 కోట్లు వరకు డిపాజిట్ చేయించుకున్నారు. ఇందులో సుమారు రూ.4 కోట్లు ఇరిగి ఇచ్చి మిగతా డబ్బులు మోసం చేశారు. బాధితుడు ఖాదర్‌వల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలన్నపై కేసు నమోదు చేసిన పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. పరారీలోఉన్న హైజాక్‌ను త్వరలో అరెస్ట్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో ఎస్‌ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా జెండా ఊరేగింపు




ఖవాలీ పోటీల్లో పాల్గొన్న గాయకులు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట దర్గాలో సోమవారం రాత్రి జెండా ఊరేగింపు, ఉరుసు వైభవంగా జరిగాయి. జెండా ఊరేగింపులో భక్తులు తమ కోరికల కొద్ది వివిధ చుట్టుపక్కల గ్రామాల నుంచి 70–80 అడుగుల పొడవు గల వెదురు బొంగుతో దర్గాకు చేరుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. అంతేకాకుండా మెరవణిలో హిందూ ముస్లిం తేడా లేకుండా పాల్గొన్నారు. రాష్ట్రంలోని నలమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. బెంగళూరు నుంచి వచ్చిన ఖవాలీ గాయకుల గానామృతాలతో ప్రజలు పరవశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు సత్యమయ్య, శంకరయ్య స్వామీలు ఉచిత అన్నదాన కార్యక్రమాలను, తీర్థప్రసాదాలు అందజేశారు. ముందు జాగ్రత్తగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా లక్కిరెడ్డిపల్లె సీఐ ఆధ్వర్యంలో మండల ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలు

మదనపల్లె : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. రామసముద్రం మండలం చెంబుకూరుకు చెందిన నవీన్ (24) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో వెళుతుండగా అంగళ్లు సమీపంలోని మిట్స్ కాలేజీ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు బాధితుడ్ని ఆటోలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

టీడీపీ ప్రచారంలో పాల్గొన్న షిఫ్ట్ ఆపరేటర్ తొలగింపు



బాలే శ్రీరాములు (ఫైల్)


పీలేరు : గుర్రంకొండ మండలం మర్రిపాడు సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్న బాలే శ్రీరాములు ఇటీవల ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులతో కలసి ఆయన ప్రచారం చేస్తున్న దృశ్యాలు అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీరాములును విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పీలేరు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

మదనపల్లె : దాడి ఘటనలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎన్. శేఖర్ తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లికు చెందిన ఒలిపి శ్రీనివాసులు 12 సంవత్సరాల క్రితం మొదటి భార్య జ్యోతిని వదిలి, మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ నేతాజీ కాలనీలో స్థిరపడ్డాడు. పెయింటర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. వంకవడ్డిపల్లెలో చెల్లెలు గంగాదేవిని ఇచ్చి వివాహం చేశారు. అయితే ఆమె భర్త అమరనారాయణ మృతి చెందడంతో, అతనికి సంబంధించిన ఆస్తిపై అతని బంధువైన రమణయ్యతో వివాదం నడుస్తోంది. ఒలిపి శ్రీనివాసులు చెల్లికి అండగా నిలిచాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వంక వడ్డీ పల్లకి చెందిన రమణయ్య అతని కుమారులు రాజు, కేశవ కత్తితో దాడికి పాల్పడడంతో శ్రీనివాసులు గాయపడ్డాడు. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొంది మంగళవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు రమణయ్య, రాజు, కేశవలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చల్లంగా చూడమ్మా.. మల్లూరమ్మ

ఘనంగా జాతర



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



జాతరలో ప్రదర్శనగా వస్తున్న చాందినీబండ్లు

చిన్నమండెం : 'మల్లూరమ్మా.. ప్రజలందరినీ చల్లంగా చూడమ్మా' అంటూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలు ప్రార్థించారు. మల్లూరమ్మ తిరునాల సందర్భంగా మంగళవారం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన నేతలకు ఆలయ కమిటీ, దేవదాయ శాఖాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికి వారి చేత పూజా కార్యక్రమాలు నిర్వహింప చేసి తీర్థప్రసాదాలు అందజేసి దుస్సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జాతరలు తెలుగు సంస్కృతికి ప్రతీకలుగా నిలుస్తున్నాయన్నారు. మల్లూరు తిరునాల సందర్భంగా మల్లూరు కొత్తపల్లెలో సర్పంచ్ భూమసాని అంజలి, లక్ష్మీరెడ్డి, మాజీ సర్పంచ్ చక్రపాణిరెడ్డి, మిషన్ చంద్రారెడ్డి, దిన్నెమీదపల్లెలో కాంక్రీట్ మేస్త్రీ గురునాథ, మల్లూరులో మాజీ సర్పంచ్ అమ్మాజీ, బెల్లంవాండ్లపల్లెలో వెంకట్రామిరెడ్డి, పిల్ల బయారెడ్డి, జల్లావాండ్లపల్లెలో ఉపాధ్యాయుడు రెడ్డన్న, కదిరివాండ్లపల్లెలో వండాడి సర్పంచ్ ముసల్‌రెడ్డిలు ఇచ్చిన విందులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు హాజరయ్యారు. జాతర సందర్భంగా మొక్కులు తీరిన భక్తులు 19 చాందినీబండ్లను ఏర్పాటు చేసి అమ్మవారి ఆలయం వద్ద తిప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సీపీ నాయకులు బాబురెడ్డి, రంగారెడ్డి, ఎంపీటీసీ శ్యామ్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, మహేశ్వరరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్ప, శివారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.